# మహారణ్యం

## కీరపల్లె వీణావాణి

శీతాకాలం అంచుకే అయిదున్నర కాకముందే బాగా చీకటి పడిపోయింది ఎముకల్ని కొరికే చలి దానికి తోడు ఈదురు గాలి వీస్తూ వుంది పడక్కుర్చీలోంచి లేచి, నాలుగడుగులు వేసి బీరువా తలుపు తీశాను ఆ బీరువా లోపల బట్టలన్నీ చిందర వందరగా పడి వున్నాయి

తుఫాను వల్ల ప్రశాంతమయిన వాతావరణాన్ని కోల్పోయిన ప్రకృతి ఎంత అస్తవ్యస్తంగా వుంటుందో ఆడమనిషి లేని యింట్లోని వాతావరణం కూడా అలాగే వుంటుంది ఏ వస్తువు ఎక్కడుండాలో అక్కడే వుంచి యింటిని పరిశుభ్రంగా వుంచుకోవడం ఆడమనిషికే తెలుసు

కోడలు పురిటి కోసం పుట్టింటికి వెళ్ళింది మా ఆవిడ తన కూతుర్నీ, మనవరాళ్ళనీ చూసి రావడం కోసం వారం క్రితం తాడేపల్లిగూడెం వెళ్ళింది యిక మా అబ్బాయి ఉద్యోగ రీత్యా రెండ్రోజుల క్రితం క్యాంపు వెళ్ళాడు

ఒంటరిగా బతకడం అలవాటై పోయిన వాడికి జనసమ్మర్ధంలో మసలడం ఎంత యిబ్బందిగా వుంటుందో యింట్లో జనాల మధ్య మసలిన వాడికి ఒంటరిగా వుండవలసి రావడం అంతే యిబ్బందిగా వుంటుంది

వారం రోజుల నుండి నా పరిస్థితీ అలాగే వుంది యింట్లో మంచి పుస్తకాలుండబట్టి సరిపోయింది లేకుంటే ఈ వారం రోజుల్లో నిజంగానే నాకు పిచ్చెక్కి పోయేది బీరువా లోంచి ఓ పాత శాలువాని బయటకు తీసి విదిలించి నా ఒంటి నిండా కప్పుకున్నాను

నేను ఉద్యోగ విరమణ చేసిన సందర్భంలో మా కాలేజీలోని సహ అధ్యాపకులు వీడ్కోలిస్తూ నాకు బహూకరించిన శాలువా అది అదంటే నాకు అమితమైన యిష్టం సజీవులైన కొందరు మనుషులతో కంటే యిలాంటి నిర్జీవ పదార్థంతోటే ఒక్కోసారి మనిషికి అనుబంధం ఏర్పడవచ్చు

తలుపు మీద ఎవరో దబదబా బాదిన చప్పుడు విన్పించడంతో పాత జ్ఞాపకాల నుండి తేరుకుని, గబగబా వెళ్ళి తలుపు గడి తీశాను ఎదురుగా గోపాలరావు 'నమస్కారం రామనాధంగారూ' అన్నాడాయన

రండి గోపాలరావు గారూ! చాలా రోజులకి అగుపించారు నవ్వుతూ అన్నాను

'తీరికెక్కడుంచండి? జీవితమంతా ఆఫీస్ తోటే గడిచిపోతూ వుంది మొత్తానికి మీరు అదృష్టవంతులు' అన్నాడు గోపాలరావు మందహాసం చేస్తూ

'ఏమిటండీ నా అదృష్టం?"

ఆ రొంపిలోంచి బయట పడ్డారుగా

ఏ రొంపి?"

అదేనండి ఉద్యోగం లోంచి

ఉద్యోగమనేది రొంపి అవునో కాదో మీకు రిటైర్డయ్యాక తెలుస్తుంది లెండి

ఏమోనండి నాకు మాత్రం నిజంగా ఉద్యోగ విరమణా జీవితమే మేలనిపిస్తుంది

'అంతేనండీ గోపాలరావుగారూ! దూరపు కొండలెప్పుడూ ఎగుడు దిగుడుగా అగుపించవులెండి" అంటూ పకపకా నవ్వేశాను

అది సరే గానీ యింట్లో మీరు తప్ప యింకెవ్వరూ సందేహంగా అడిగాడు గోపాలరావు

"నేను తప్ప యింకెవ్వరూ లేరండి' ఎవరెవరు ఎక్కడెక్కడికెళ్ళారో వివరించాను •

మరి మీకు భోజనం'

నా చేతుల్ని చూస్తే మీ ప్రశ్నకి సమాధానం గ్రహించగలరు అంటూ అక్కడక్కడా కాలి వాతలు బడ్డ నా రెండు చేతుల్ని చూపెట్టాను

అయ్యయ్యో! అదేమిటండీ అలా కాల్చుకున్నారు? పని మనిషి చేత వంట "

ఆఁ. మొదట ఆ పనే చేశాననుకోండి పని మనిషికే వంట బాధ్యతని అప్పగించి వెళ్ళింది మా ఆవిడ ఒక్కరోజు మాత్రం పని మనిషి వండితే తిన్నాను ఆ రెండో రోజు నుండి మానేశాను ఎందుకని అడగరేం? ఆ తిండే తిన్నానంటే మా ఆవిడ తిరిగొచ్చే వరకైనా బ్రతుకుతానో లేదోనని

నేనలా అనడం తోటే గోపాలరావు విరగబడి నవ్వేశాడు గతంలో మేం ఓ నాలుగేళ్ళు గోపాలరావు వాళ్ళ పక్కింట్లో అద్దెకుండే వాళ్ళం కనుక వాళ్ళ కుటుంబ సభ్యులకీ మా కుటుంబ సభ్యులకీ మంచి పరిచయమే వుంది అప్పుడప్పుడూ గోపాలరావు మా యింటికొచ్చి పోతుంటాడు

'రామనాధం గారూ! మీరేమైనా అనుకోండి వచ్చే రోజుల కంటే పోయే రోజులే నయమనిపిస్తున్నాయి రాబోయే రోజుల్లో ఈ భూతలం మీద ఆవగింజంత మానవత్వమైనా అగుపించదేమో అన్నాడు గోపాలరావు

ప్రశ్నార్థకంగా చూశాను

'కృతయుగంలో దర్మం నాలుగు కాళ్ళతో నడిచేది త్రేతాయుగంలో ఓ కాలు తెగి ధర్మదేవత మూడు కాళ్ళతో నడిచేది ద్వాపర యుగంలో రెండు కాళ్ళే మిగిలాయి ఈ కలియుగంలో ధర్మదేవతకి ఒకే ఒక్క కాలు మిగిలింది ఆ ఒక్క కాలు కూడా యిప్పుడు ఘోరంగా నరికెయ్యబడుతూ వుంది

'ఎందుకలా అనుకుంటున్నారు?' తల తిప్పి గోపాలరావు వేపు చూశాను

మన కళ్ళ ముందే విరాట్ స్వరూపాన్ని దరించి అవినీతి, అధర్మం విలయతాండవం చేస్తూ వుంటే యిక అలా అనుకోక తప్పడం లేదు తెలుగు నిఘంటువులోని 'అవినీతి' అనే పదం వుంది చూశారూ! అదివాళ సమస్త మానవ జీవితాన్ని శాసించే శక్తిలా పరిణమించి పోయింది

చిత్రంగా చూశాను ఆయన వేపు

అవును రామనాదం గారూ! యివాళ ప్రతి మనిషి నాలుక మీద అదృశ్యంగా వుండే బీజాక్షరాలు 'అవినీతి', ఈ దురన్యాయ వ్యవస్థలో అదే ఓంకారం. ఈ భారతదేశమనే భూగోళం మీద గంగ, యమున, బ్రహ్మపుత్ర యివి కాదు అన్యాయం, అక్రమం, లంచగొండితనం ఈ మూడే జీవనదులు" ఆవేశంగా అన్నాడు గోపాలరావు

'మీ మాటలు చిత్రంగా వున్నాయ్ "

'చిత్రంగానే వుంటాయ్ రామనాధం గారూ!శరద్రాత్రుల్ని మాత్రమే చూసిన వాళ్ళు. అమావాస్య రాత్రుల్ని నమ్మలేరు నీతీ, నిజాయితీల మధ్య జీవించి యిప్పుడు మీరు యింట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు ఒక్కసారి వెలుపలికొచ్చి మన స్వతంత్ర బారత దేశాన్ని చూడండి వేదాలు పుట్టిన ఈ భూమి ఎంతగా క్షతగాత్రమై పోయిందో మీకే తెలుస్తుంది ఇతిహాసాల, పురాణాల సారాన్ని జీర్ణించుకున్న ఈ పవిత్ర క్షేత్రం లంచగొండితనంతో ఎంతగా కుళ్ళి పోయిందో మీకే అర్థమవుతుంది యివాళ దురన్యాయమే మానవజాతి మత గ్రంధమని తెలుసుకోవాలనుకుంటే మీరోసారి వెలుపలి ప్రపంచంలోకి రండి'

'గోపాలరావుగారూ! మీరేదో ఆవేశంలో పడిపోతున్నారు మీ మాటలు వింటుంటే నాకు మీ శంకరం గాడే గుర్తొస్తున్నాడు చదువుకునే రోజుల్లో శంకరం కూడా యింతే ప్రతి చిన్న విషయానికీ తీవ్రంగా ఆవేశపడిపోయేవాడు. అడగడం మరిచాను యింతకీ మీ శంకరం ఎలా

వున్నాడు? ఏం చేస్తున్నాడు?" శంకరం గురించి అడిగాను

"వాడి విషయం గుర్తుకొచ్చే నేను కాస్త ఆవేశపడ్డాను రామనాథంగారూ! శంకరం చదువైపోయి మూడేళ్ళు దాటింది. ఈ వూళ్ళోనే ఒక ప్రయివేటు కంపెనీలో సంవత్సరం నుండి వర్క్ చేస్తున్నాడు' చెప్పాడు గోపాలరావు

'ఉద్యోగం పర్మనెంటేనా?'

"ఓ అయిదు వేలు లంచం యివ్వగలిగితే పర్మనెంటవుతుంది లేదా ఈ నెల చివరికల్లా శంకరం ఉద్యోగం వూడిపోతుంది" గోపాలరావు దిగులుగా అన్నాడు.

'అదేమిటి?"

చచ్చిన తర్వాత వొల్లకాట్లో కాటికాపరి చేతుల్లో పెట్టేది బతికున్నప్పుడు ఆలయంలో దేవుడి హుండీలో వేశేదీ చ స్తూ బతుకుతున్నప్పుడు పై అధికారులకు సమర్పించేదీ. . దీన్నే లంచమంటారు లెండి '

"అసలు విషయం చెప్పండి

"మా తమ్ముడు శంకరం వర్క్ చేస్తున్న కంపెనీకి సంబంధించిన హెడ్డాఫీసు హైదరాబాద్‌లో వుందండి అందులోని మేనేజింగ్ డైరెక్టర్ గారికి అయిదు వేలు లంచం గానీ యిస్తే . శంకరాన్ని పర్మనెంటు చేస్తారట "

"అలాగా?"

"అవునండి. ఆ అయిదు వేలూ ఈ నెల చివరికల్లా తెచ్చివ్వమన్నాడట ఆ మేనేజింగ్ డైరెక్టర్ మా ఆర్థిక స్థితిగతులు మీకు తెలిసిందేగా శంకరాన్ని డిగ్రీ చదివించడానికే నేను చాలా యిబ్బందులు పడ్డాను మా అమ్మాయి పెళ్ళికి చేసిన అప్పు యింకా తీరలేదు" అన్నాడు గోపాలరావు

బరువుగా ఓ నిట్టూర్పు విడుస్తూ గోపాలరావు వేపు సానుభూతిగా చూశాను

మీకో షాకింగ్ న్యూస్ చెప్పనా?" అన్నాడు గోపాలరావు నా కళ్ళల్లోకి చూస్తూ

"చెప్పండి "

'ఆ మేనేజింగ్ డైరెక్టరెవరో కాదు ఒకప్పుడు మీ దగ్గర చదువుకున్న స్టూడెంట్ "

'ఈ న్యూస్‌కి నేను షాకై పోలేదండి నా స్టూడెంటైనంత మాత్రాన లంచగొండిగా మారడానికి వీల్లేదని శాసనం లాంటిదేమీ లేదనుకుంటాను '

గోపాలరావు మాట్లాడలేదు

"ఈ రోజు దేశాన్ని దోచుకుంటున్న కొందరు రాజకీయ నాయకులనబడే లైసెన్స్ డెకాయిట్స్. ఒకనాడు కాలేజీల నుంచి 'గుడ్ కాండక్ట్' సర్టిఫికెట్స్ తీసుకు వెళ్ళిన వాళ్ళే '

"రామనాథంగారూ! యిప్పుడు నేను నిజంగానే మీకు షాకింగ్ న్యూస్ చెబుతున్నాను' అన్నాడు గోపాలరావు ఓ చిన్న మందహాసం చేస్తూ

' చెప్పండి "

"గిరిబాబు అనే అబ్బాయి ఈ వూళ్ళోని కాలేజీలో కొన్నేళ్ళ క్రితం బి. కాం. చదివాడు. అప్పట్లో మీరు వాళ్ళ క్లాసుకు వెళ్ళేవారు. అతనికి మీరంటే చాలా అభిమానం ఎంతో గౌరవం. ఈ గిరిబాబే శంకరాన్ని అయిదు వేలు లంచం అడిగిన ఆ మేనేజింగ్ డైరెక్టర్ అన్నాడు గోపాలరావు.

నేను ఆశ్చర్యపోయాను గిరిబాబు నా ఓల్డ్ స్టూడెంట్. నేనంటే అతనికి నిజంగానే ఎంతో అభిమానం. ఆర్నెల్ల క్రితం ఓ సారి గిరిబాబు నాకు హైదరాబాద్‌లో అగుపించి నాతో ఎంతో అభిమానంగా మాట్లాడాడు.

నేను దిగిన లాడ్జిలోని నా రూంని ఖాళీ చేయించి. నన్ను బలవంతంగా తన యింటికి తీసుకు వెళ్ళి నాకు రెండ్రోజులు ఆతిథ్యమిచ్చాడు గిరిభాబు

"రామనాథం గారూ! మా శంకరానికి మీరు గానీ అనుకుంటే ఆ ఉద్యోగాన్ని పర్మనెంటు చెయ్యగలరండి" నా వేపు అభ్యర్థనగా చూశాడు గోపాలరావు.

ఆయన మనసులోని అభిప్రాయాన్ని గ్రహించడానికి నాకు ఎక్కువ సేపు పట్టలేదు

వెంటనే కుర్చీలోంచి పైకి లేచి, బీరువా దగ్గరికి వెళ్ళి బట్టలు మార్చుకున్నాను ఓ సూట్‌కేస్‌ని ఓపెన్ చేసి, అందులో వున్న పాత డైరీని అందుకుని, పేజీలను తిరగేశాను గిరిబాబుకు సంబంధించిన విజిటింగ్ కార్డును జేబులో పెట్టుకుని గోపాలరావు దగ్గరి కొచ్చాను

"రండి గోపాలరావు గారూ!'

ఎక్కడికి?"

'గిరిబాబుకు ఫోన్ చేద్దాం'

"టెలిఫోన్ ఎక్ఛేంజిలోని జె ఇ గారు నాకు బాగా తెలుసు" అన్నాడు గోపాలరావు

"అయితే యింకేం పదండి '

యింటికి తాళం వేసి పావుగంటలో టెలిఫోన్ ఎక్ఛేంజికి చేరుకున్నాం టెలిఫోన్ జె ఇ తో మాట్లాడి హైదరాబాద్‌లోని గిరిబాబుకి ఎస్ టి డి చేశాం

"హలో" గిరిబాబు గొంతు.

"హలో గిరీ! నేను.. రామనాథం ."

"నమస్తే సార్! ఏమిటి విశేషం?"

"నువ్వో సాయం చెయ్యాలి గిరీ!"


'విత్ ప్లెజర్ "

"ఏం లేదు... యిక్కడ మా వూళ్ళో వున్న మీ కంపెనీ బ్రాంచాఫీస్‌లో శంకరం అనే కుర్రాడు టెంపొరరి పోస్ట్‌లో వర్క్ చేస్తున్నాడు' అంటూ శంకరం గురించి వివరంగా చెప్పి సాయం చెయ్యమని అడిగాను

"థ్యాంక్యూ గిరీ!" ఫోన్ పెట్టేశాను

"ఏమంటున్నాడండి?' అమితమయిన ఆతృతతో అడిగాడు గోపాలరావు.

"యింకో మూడ్రోజుల్లో శంకరానికి పర్మనెంట్ ఆర్డర్ వస్తుంది" నేనా మాట అనడం తోటే కృతజ్ఞత నిండిన చూపుతో నా చేయి పట్టుకున్నాడు గోపాలరావు



యిద్దరం కల్సి హోటల్లో టిఫిన్ తిని, రోడ్డు మీది కొచ్చాం. గోపాలరావు దగ్గర సెలవు తీసుకుని రిక్షాలో, నేను యింటి కొచ్చేశాను. వీధిలోంచి యింట్లోకి వెళ్తూ వుంటే... 'నమస్కారం మాస్టారూ' అన్నారెవరో. తిరిగి చూశాను. మా యింటి ముందు నిలబడి నా వేపే చూస్తున్నాడో యువకుడు.

"బావున్నారా మాస్టారూ? నేను మీకు బహుశా గుర్తులేకపోవచ్చు. ఆరేళ్ల క్రితం ఈ వూళ్లోనే నేను డిగ్రీ చదువుతున్నాను. నా పేరు దామోదరం. మీరు మాకు 'కాస్టింగ్' టీచ్ చేశేవాళ్లు. మాదీ వూరు కాదు, ముప్ఫయ్ కిలో మీటర్ల దూరంలో ఓ పల్లెటూరు" చెప్పాడా అబ్బాయి.

"అలాగా బాబూ! యిప్పుడేం చేస్తున్నావ్" అడిగాను దామోదరం వేపు చూస్తూ.

"ఉద్యోగ ప్రయత్నంలో విసిగిపోయాను. సార్! మీరు కాస్టింగ్‌లో అబ్ నార్మల్ వేస్టేజి, నార్మల్ వేస్టేజి గూర్చి చెబుతుండే వారు" అన్నాడు దామోదరం

బదులుగా నేను నవ్వాను

"యిండియా అనబడే ఈ యిండస్ట్రీలో నార్మల్ వేస్టేజ్ మెటీరియల్ ఏమిటో తెలుసా సార్? మిడిల్ క్లాస్ యిదొక యూజ్‌లెస్ క్లాస్" విరక్తిగా అన్నాడతడు.

"యింతకీ ఏం పని మీదొచ్చావు బాబూ?' అన్నాను ఏం మాట్లాడాలో తోచక

"మా నాన్నగారికి రావలసిన పెన్షన్... దానికి సంబంధించిన వర్కు మీద యివాళే ఈ వూరొచ్చాను యిక వస్తాను మాస్టారూ" నమస్కరించాడతడు.

"మంచిది నాయనా వెళ్లిరా" అంటూ దామోదరానికి ప్రతి నమస్కారం చేశాను

అతడు వెళ్లిపోయాడు

డిగ్రీ కాలేజి లెక్చరర్‌గా పదవీ విరమణ చేసిన నాకు.. అప్పుడప్పుడూ పాత విద్యార్థులు అగుపిస్తుంటారు. గౌరవాభిమానాలతో పలకరిస్తూ వుంటారు

అదో తియ్యని అనుభూతి

విద్యార్థి చేత గౌరవింపబడే లెక్చరర్ కంటే. లెక్చరర్ని గౌరవించే సంస్కారమూ సహృదయమూ గల విద్యార్థే ఉన్నతుడని నా అభిప్రాయం

మూడు రోజులు గడిచిపోయాయి క్యాంపు కెళ్లిన మా అబ్బాయి యింకా రాలేదు. మా ఆవిడ కూడా రాలేదు. యింట్లో ఏం తోచకపోవడంతో అలా తిరిగొద్దామని బజారుకి బయల్దేరాను. ట్రంక్ రోడ్డు మీద బి పి యస్ సెంటర్ దగ్గర మళ్లీ కన్పించి పలకరించాడు దామోదరం

ఏం దామోదరం! యింకా వూరెళ్ల లేదా?" అడిగాను దామోదరాన్ని.

'లేదు మాస్టారూ! వచ్చిన పని యింకా జరగలేదు అసలు జరిగేటట్లు లేదు."

"అదేమిటి?"

'అంతే మాస్టారూ! ఈ దౌర్భాగ్య వ్యవస్థలో లంచగొండితనం మానవత్వానికి కర్మకాండలు నిర్వహిస్తూ వుంది"

"ఏమైంది దామోదరం?"

"తాలూకా ట్రెజరీ కార్యాలయంలో రెండు వందలు లంచం యివ్వని కారణంగా ఆ క్లర్కు నా పని చేసి పెట్టడం లేదు" అసలు విషయం చెప్పాడు దామోదరం.

ట్రెజరీ ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తున్న గోపాలరావు గుర్తొచ్చాడు నాకు

"సరే దామోదరం . రేపు ఉదయం పదకొండు గంటలకి నువ్ ట్రెజరీ ఆఫీస్‌కి వచ్చేయ్ నేనూ వస్తాను తప్పకుండా నీ పని జరిగిపోతుంది. ఆ ఆఫీసులో గోపాల్రావని నాకు బాగా పరిచయమున్న ఒకాయన . "

'లంచం యివ్వమని నాల్గు రోజుల్నుంచి నన్ను వేపుకు తింటున్నది ఆ గోపాల్రావే మాస్టారూ!"

'ఆఁ..' శిలలా బిగుసుకు పోయాను మనిషి ద్వంద్వ ప్రమాణాలతో జీవిస్తున్నాడా??

"దామోదరం! తప్పకుండా రేపు ఉదయం పదకొండు గంటలకి ఆఫీస్ దగ్గరికి వచ్చేయ్"– అనేసి అక్కడ్నుంచి వెనుతిరిగి మళ్లీ యింటి కొచ్చేశాను

అరగంట తర్వాత ముఖం చాటంత చేసుకుని మా యింటి కొచ్చాడు గోపాలరావు

"రామనాథం గారూ! మీ ఋణమెలా తీర్చుకోవాలో తెలియడం లేదండి మా శంకరం గాడికి యివాళే పర్మనెంట్ అపాయింట్‌మెంట్ వచ్చింది."

"రాయల్ కామన్ వెల్త్ సొసైటీ" (లండన్) నిర్వహించిన వ్యాస రచన పోటీలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన తూర్పు గోదావరిలోని కాకినాడకు చెందిన కుమారి ఐ హిమబిందుకి అవార్డు లభించింది. ఈ బాలిక గోదావరి ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ రీజనల్ మేనేజరు శ్రీ ఐ కృష్ణమూర్తి కుమార్తె



"చాలా సంతోషం గోపాలరావుగారూ! మిమ్మల్ని ఓ మాట అడుగుతాను. నిజం చెబుతారా?"

"అడగండి "

"దామోదరం అనే ఓ అబ్బాయి ఓ పని మీద మీ ఆఫీస్ కొచ్చి నాల్గురోజుల్నించి మీ చుట్టూ తిరుగుతున్నాడు మీరతన్ని రెండొందలు లంచమడిగారా లేదా?"

నేనలా సూటిగా ప్రశ్నించే సరికి గోపాలరావు బిత్తరపోయాడు నా ముఖంలోకి చూడలేక తల దించుకుని నేల చూపులు చూస్తూ తగ్గు స్వరంతో "నిజమేనండి అడిగాను" అన్నాడు గోపాలరావు. రెండు క్షణాల పాటు మా మధ్య మాటలు కరువై.. మౌనం అల్లుకు పోయింది.

"మీ శంకరం ఉద్యోగానికి గిరిబాబు అయిదు వేలు లంచం అడిగినందుకు ధర్మం, న్యాయం, అంటూ మీరెంతగా ఘోషించారో మీకు గుర్తుందా? చూడండి! ధర్మం, న్యాయం, నీతీ యివి మనకు గుర్తు రావలసింది మనకు ఎదుటి వాడి వల్ల అన్యాయం జరిగినప్పుడు కాదు ఎదుటి వాడికి మన వల్ల అన్యాయం జరుగుతున్నప్పుడు "

గోపాలరావు మాట్లాడలేదు

'కలియుగంలోని ధర్మదేవతకి మిగిలిన ఆ ఒక్క పాదం కూడా నరికెయ్యబడుతూ వుందని బాధ పడ్డారు అందులో మీ పాత్ర కూడా వుందని గుర్తించండి. నిఘంటువులోని 'అవినీతి' అనే పదం నిఘంటువును వదిలేసి, మీబోటి వాళ్ళ గుండెల్లో శాశ్వత స్థావరాన్ని ఏర్పరచుకొన్నదని ఏనాటికైనా గ్రహించండి గోపాలరావు గారూ!"

ఆయన ముఖం పాలిపోయింది.

"ఏ రకం మనుషుల నాలుకల మీద 'అవినీతి' అనే బీజాక్షరాలు అదృశ్యంగా వున్నాయో.. ఏ తరగతి మనుషులకి అది ఓంకారమో .. ఏ రకమైన జాతికి దురన్యాయం ఒక మతగ్రంథమో.. వేదాల్ని పుట్టించిన ఈ భారత మాత దేహం ఏ దానవ జాతి వల్ల క్షతగాత్రమై పోయిందో పురాణాల సారాన్ని పూర్తిగా జీర్ణించుకున్న ఈ పవిత్ర క్షేత్రం... లంచగొండితనంతో కుళ్లి పోవడానికి ఏ తెగ పురుగులు కారణమో యివన్నీ మీకు తెలియదని నేననుకోను" తీవ్రంగా అనేశాను.

"రామనాథం గారూ! ఈ వ్యవస్థలో నేనింక అంతర్భాగాన్ని మాత్రమే. యిదొక దట్టమైన అడవి. యిందులో సంచరించే జంతువుల కొక నిర్దుష్టమైన జీవన విధానం వున్నట్లు అగుపిస్తుంది కానీ వుండదు. యిక్కడ ప్రతి ప్రాణీ తన కంటే బలవంతమైన ప్రాణి నుండి . తనను తాను రక్షించుకుంటూ తన కంటే బలహీనమయిన ప్రాణిని వేటాడుతుంది. నేనూ అదే చేశాను మృగ ధర్మమే ఈ నాటి యుగధర్మం" గోపాలరావు మాటలకి నేను స్థాణువైపోయాను. ●